నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# సంగారెడ్డి

సోమవారం 18 డిసెంబర్ 2023
MONDAY, DECEMBER 18, 2023

SANGAREDDY

పేజీలు PAGES : 8





# నీళ్లివ్వండి

## సిద్దిపేట జిల్లాలో రంగనాయక సాగర్‌కు నీటిని విడుదల చేయండి



- మిడ్‌మానేరు నుంచి 1.5 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలి
- సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వండి
- ఈ యేడాది వర్షాభావ పరిస్థితులు
- రైతాంగం కోసం సత్వరం చర్యలు తీసుకోండి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

8

సిద్దిపేట జిల్లా రైతాంగానికి యాసంగి పంటకు నీళ్లు అందించాలని, అందుకు అవసరమైన నీటిని మిడ్‌మానేరు నుంచి రంగనాయక సాగర్‌కు పంపింగ్ చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు లేఖ రాశారు. ఈ మేరకు శనివారం శాసనసభలో మంత్రిని కలిసి ఆయన లేఖ అందజేశారు. సిద్దిపేటలో లేఖ సారాంశాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం మీడియాకు విడుదల చేశారు. మూడేండ్లుగా జిల్లాలో సాగు భూములకు రంగనాయకసాగర్ ద్వారా నీరు అందజేశామన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యాసంగి పంటకు సరిపడా నీరు రిజర్వాయర్‌లో లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు. అధికారులకు ఆదేశించి తక్షణం నీటిని విడుదల చేయాలని లేఖలో హరీశ్‌రావు కోరారు.

– సిద్దిపేట, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)






# సర్కారు బడులకు సౌర కాంతులు

## కరెంట్ బిల్లుల కట్టడికి ప్రభుత్వ నిర్ణయం

- ఏటా పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- రాష్ట్రవ్యాప్తంగా 6,490 పాఠశాలలు గుర్తింపు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 900 ఎంపిక
- త్వరలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు
- టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా కసరత్తు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఐదేండ్లు రెడ్కోకు నిర్వహణ బాధ్యతలు
- భవిష్యత్తులో అన్ని సర్కారు బడుల్లో ఏర్పాటుకు చర్యలు

5

ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా పెరుగుతున్న విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 6,490 బడుల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 900 స్కూళ్లను గుర్తించింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, కస్తూర్బా పాఠశాలల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. విద్యుత్ వినియోగాన్ని బట్టి 2, 5, 10 కిలో వాట్ల స్వామర్థ్యం గల సోలార్ పలకలను అమర్చనున్నది. ఒక్కో కిలోవాట్‌కు రూ.లక్ష ఖర్చు అవుతుండగా, ఇందుకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పనులు రెడ్కోకు అప్పగించడంతో పాటు వచ్చే ఐదేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ఒప్పందం చేసుకున్నది. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని ఆదేశాలు జారీచేసింది. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి కరెంట్ బిల్లులకు శాశ్వతంగా స్వస్తి చెప్పేలా కార్యాచరణ రూపొందిస్తున్నది. –మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 17

# ప్రజలకు రుణపడి ఉంటా

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జోగిపేటలో ప్రజలు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి


మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న ఆర్డీవో పాండు

అందోల్, డిసెంబర్ 17: అందోల్ నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేటలో కృతజ్ఞత కార్యక్రమం ఏర్పాటు చేయగా అందోల్–జోగిపేట ఆర్డీవో పాండు, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు మంత్రిని సన్మానించారు. మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, శివశంకర్, సత్యనారాయణ, హరికృష్ణగౌడ్, రంగసురేశ్, రేఖాప్రవీణ్, నాగరాజు, దుర్గేశ్, చందర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, నాయకులు సారశివకుమార్, ప్రవీణ్, సంగమేశ్వర్, శ్రీశైలం, సందీప్‌గౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ బాస్‌ల బదిలీ

## హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీగా మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని


ఎన్.శ్వేత

- హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా ఎన్.శ్వేత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

8

మెదక్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రోహిణిప్రియదర్శిని హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా, సిద్దిపేట సీపీగా విధులు నిర్వహిస్తున్న ఎన్. శ్వేత హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. –మెదక్ అర్బన్/సిద్దిపేట అర్బన్, డిసెంబర్17


రోహిణి ప్రియదర్శిని